క్లుప్తంగా

బాధితులకు సాయం



కుట్టు మెషీన్లు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: నగరంలోని పలువురికి భవానీ చారిటబుల్ ట్రస్టు తరఫున సోమవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు సహాయం అందించారు. షార్ట్ సర్క్యూట్‌తో సర్వం కోల్పోయిన టైలర్ మల్లిబాబు కుటుంబానికి కుట్టుమెషీన్లు, వారి పిల్లలకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం చేశారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, పలువురు విద్యార్థులకు సాయమందించారు.

హైందవ శంఖారావానికి తరలిరావాలి



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గండేపూడి సురేష్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కావాలనే ప్రధాన డిమాండ్‌తో జనవరి 5న విజయవాడలోని కేసరపల్లిలో నిర్వహించే హైందవ శంఖారావం మహాసభను విజయవంతం చేయాలని జిల్లా వ్యవస్థ ప్రముఖ్, ప్రధానవక్త గండేపూడి సురేష్ అన్నారు. కాతేరులోని గణపతి మందిరంలో సోమవారం విశ్వ హిందూపరిషత్ హైందవ శంఖారావం బస్తీ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మహాసభకు హిందూ బంధువులందరూ తరలిరావాలని పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా పలువురు తమ పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమం సూర్య శంకరరావు, పట్టాభి రామన్న, సత్య కుమార్, పట్టపు చలపతిరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రాజమహేంద్రవరం సిటీ: కడియం రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై లోవరాజు సోమవారం తెలిపారు. మృతుడికి సుమారు 30 ఏళ్ల వయసు ఉంటుందని, ఒంటిపై గులాబీ రంగు బనియన్, నలుపు రంగు ప్యాంటు ఉన్నాయన్నారు. మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించామని తెలిపారు. అతడి ఆచూకీ తెలిసినవారు 94406 27551, 94914 44022 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: కారు ఢీకొన్న ఘటనలో శాటిలైట్ సిటీకి చెందిన లారీ డ్రైవర్ నరం తాతారావు (43) మృతి చెందాడు. ఆటో నగర్ వద్ద ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శాటిలైట్ సిటీకి చెందిన నరం తాతారావుకు భార్య లక్ష్మితో మనస్పర్థలు వచ్చాయి. దీంతో ఆమె తన అమ్మాయిలను తీసుకుని భీమవరంలో ఐదేళ్లుగా వేరుగా ఉంటుంది. దీంతో తాతారావు తన తల్లి రాఘవమ్మ వద్ద ఉంటున్నాడు. కాగా.. తాతారావు ఆదివారం రాత్రి పని ముగించుకుని ఇంటికి నడిచి వస్తుండగా ఆటోనగర్ ఫ్రెండ్స్ దాబా దాటిన తరువాత వెనుక నుంచి కారు అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి రాఘవమ్మ ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా గణిత దినోత్సవం



గణిత దినోత్సవంలో పాల్గొన్న డేవిడ్‌రాజు, ఉపాధ్యాయులు

కంబాలచెరువు: సీతంపేటలోని శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గణిత ఉపాధ్యాయుడు సీహెచ్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ రామానుజన్ గణితానికి చేసిన సేవలను వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులను ఏజీఎం ఎంవీ సురేష్, రీజినల్ ఇన్‌చార్జి యు.ఉదయ్‌శంకర్, జోనల్ కో ఆర్డినేటర్ కిరణ్ పాండే, డీన్ జేవీ సాయి కిరణ్, సి ఇన్‌చార్జి కుసుమ, ప్రైమరీ ఇన్‌చార్జి వాసంతి, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు.

ఐయ్యో పాపం

- నాలుగు నెలలుగా నిలిచిన 'కంటివెలుగు'
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో అందని కంటి వైద్యం
- కూటమి ప్రభుత్వంలో నిలిపివేత



కడియం ప్రభుత్వ ఆసుపత్రి



మూసివేసిన కంటి వైద్య పరీక్షల గది



ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చిన రోగులు

కడియం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య పరీక్షలు నిలిచిపోయాయి. ఒకటి కాదు, రెండు కాదు.. దాదాపు నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొంది. కంటి పరీక్షల కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తున్న రోగులు ఇక్కడ సేవలు లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ప్రతి రోజూ 20 నుంచి 40 మంది వరకూ కంటి వైద్యపరీక్షలు చేయించుకునేవారు. ఇప్పుడు వీరందరూ ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడుతున్నారు.

కూటమి ప్రభుత్వంలో బ్రేక్

కంటివెలుగు కార్యక్రమం కింద ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి కళ్లజోళ్లు అందించేవారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రజలకు ఉపయోకరంగా ఉండడంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కూడా దీన్ని కొనసాగించింది. ఈ కార్యక్రమంతో రోగులకు ఎంతో ప్రయోజనం కలిగేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కంటివెలుగు కార్యక్రమాన్ని నిలిపివేసింది.

ప్రైవేటు ఆస్పత్రులే ఆధారం

కడియం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో దాదాపు 1.30 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరిలో దిగువ మధ్యతరగతి, పేద వర్గాలకు చెందిన వారే అత్యధికం. వీరంతా తమ కంటి సంబంధిత సమస్యలకు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించే కంటి వైద్య పరీక్షలపై ఆధారపడేవారు. ఇప్పుడు వైద్య పరీక్షలు ఆపివేయడంతో ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

సర్వత్రా ఆందోళన

ఆస్పత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో ఆప్తమాలజీ సిబ్బందిని కంటి వెలుగు కార్యక్రమానికి నియమించారని, ప్రస్తుతం కాంట్రాక్టు పూర్తికావడంతోనే వైద్య పరీక్షలు నిలిపివేశారని ఇక్కడి సిబ్బంది చెబుతున్నారు. అయితే ప్రజలకు ఎంతో ప్రయోజనకరమైన ఈ కార్యక్రమాన్ని నిలిపివేయడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తక్షణం కంటి వైద్య పరీక్షలను పునరుద్ధరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పరీక్షలు చేసేవారు లేవు

గతంలో కడియం ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి పరీక్షలు చేయించుకున్నాను. ఇప్పుడు మళ్లీ చేయించుకుందామని వచ్చాను. కానీ పరీక్షలు చేసేవారు రావడం లేదని ఇక్కడి సిబ్బంది చెబుతున్నారు. దీంతో తిరిగి వెళ్లిపోతున్నాను.

– కె.మరియమ్మ, వేమగిరి

పునరుద్ధరించాలి

ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్య పరీక్షలను పునరుద్ధరించాలి. ఇక్కడకు నిత్యం దాదాపు 40 మంది వరకూ వైద్యం కోసం వచ్చేవారు. ఈ సేవలు నిలిపివేయడంతో వారందరూ ఇబ్బందులు పడుతున్నారు.

– కె.సూరి, కడియం

పోస్టల్ బీమా చెక్కు అందజేత



నామినీకి పోస్టల్ బీమా నమూనా చెక్కు అందిస్తున్న అధికారులు

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ తపాలా శాఖ ఇండియా పోస్ట్ చెల్లింపుల బ్యాంకు (ఐపీపీబీ) ద్వారా గ్రూప్ యాక్సిడెంటల్ పాలసీని అందిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ సర్కిల్ డైరెక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ కె.సంతోష్ నేతా అన్నారు. ఏడాదికి రూ.396 ప్రీమియంతో రూ.పది లక్షల బీమా పొందవచ్చన్నారు. ఈ మేరకు పాలసీ నామినీ అయిన పాకలపాటి రమణికి సోమవారం రూ.పది లక్షల చెక్కు అందజేశారు. ఆటో డ్రైవర్ అయిన ఆమె భర్త ఇటీవల మృతి చెందారు. ఆయన గతంలోనే ఈ బీమా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో పోస్టల్ నుంచి మంజూరైన బీమాను ఆమెకు అందించారు. కార్యక్రమంలో సర్కిల్ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ వై.రాకేష్, పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కోట శేషారావు, ఐపీపీబీ బ్రాంచ్ హెడ్ రాజేంద్ర నాయుడు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

రాజమహేంద్రవరం సిటీ: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ పేరుతో రాజకీయాలు చేస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దున్న సుమన్ బాబు, జిల్లా జనరల్ సెక్రటరీ పల్లి ధర్మేష్ ప్రసాద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రాంబాబుకు విశిష్ట రైల్ సేవా పురస్కారం



రైల్వే మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రాంబాబు

రాజమహేంద్రవరం సిటీ: సీనియర్ డివిజినల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు విశిష్ట రైల్ సేవా పురస్కార్ అందుకోవడం అభినందనీయమని రాజమహేంద్రవరం రైల్వే కమర్షియల్ విభాగం అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఈ నెల 21న రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ చేతుల మీదుగా రాంబాబు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రైల్వే అధికారులు మాట్లాడుతూ విజయవాడ డివిజన్‌లో మొట్టమొదటిసారిగా ఈ అవార్డు రావడం విశేషమన్నారు. 2023 – 24 సంవత్సరంలో నిర్ణీత లక్ష్యం కన్నా 50 శాతం అదనంగా నమోదు చేయడం, నన్ షేర్ రెవెన్యూ ద్వారా డివిజన్‌కు గణనీయమైన ఆదాయం తీసుకుని రావడంతో రాంబాబు ప్రతిభ చూపారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో టిక్కెట్ చెకింగ్ ద్వారా రూ.7.96 కోట్లు సమకూర్చడంతో ఆయనకు ఈ అవార్డు దక్కిందన్నారు. ఈ సందర్భంగా రాంబాబుకు విశ్రాంత సీటీఐ కేశవభట్ల శ్రీనివాసరావు, స్టేషన్ సీటీఐ సుంకర చంద్రమౌళి, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణ్, కేటరింగ్ ఇన్‌స్పెక్టర్ దేవానంద్, రిజర్వేషన్ సూపర్ వైజర్ డి.శ్రీనివాసరావు, పార్సిల్ ఆఫీస్ సూపర్ వైజర్ రఘురాం, బుకింగ్ సూపర్ సూపర్ వైజర్ రాజేంద్ర ప్రసాద్, గూడ్స్ షెడ్ సూపర్ వైజర్ డి.రాజరాజేశ్వరి అభినందనలు తెలిపారు.

రెవెన్యూ సదస్సులకు 1,645 అర్జీలు



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా 1,645 అర్జీలను స్వీకరించామని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి రెవెన్యూ సదస్సులు, ఉపాధి హామీ, పీజీఆర్ఎస్, హౌస్ హోల్డ్ సర్వే, జల్ జీవన్ మిషన్ తదితర అంశాలపై జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు, డీఆర్వో టి.సీతారామమూర్తితో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అధికారులు అర్జీల పరిష్కారం చేసేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.

సామ్రాజ్య సిల్వర్ కింగ్‌డమ్ షోరూం ప్రారంభం



సిల్వర్ షోరూంను ప్రారంభిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సామ్రాజ్య సిల్వర్ కింగ్‌డమ్ సిల్వర్ రిటైల్ అండ్ హోల్ సేల్ షోరూం సోమవారం ప్రారంభమైంది. పాత సోమాలమ్మ గుడి రోడ్డులోని ఐకాన్స్ రైజ్ బిల్డింగ్‌లో దీన్ని ఏర్పాటు చేశారు. రోటరీ డిస్ట్రిక్ గవర్నర్ ఆర్‌టీఎన్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఓఎన్జీసీ అసెట్ మేనేజర్ శాంతానుదాస్, సామ్రాజ్య సిల్వర్ కింగ్ డమ్ విజయవాడ మెయిన్ చైర్మన్ మహేష్ జాజ్ చేతుల మీదుగా ఈ ప్రారంభోత్సవం జరిగింది. అనంతరం క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్, సామ్రాజ్య చైర్మన్ తీగెల రాజా మాట్లాడుతూ రోటరీ క్లబ్ సభ్యులందరం కలిసి సామ్రాజ్య సిల్వర్ కింగ్‌డమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దీనిలో వచ్చిన లాభంలో కొంత భాగం సమాజసేవకు వినియోగిస్తామన్నారు. మూడో ఫ్లోర్ ఐకాన్స్ కన్వెన్షన్ హాల్‌ను ఫాస్ట్ గవర్నర్ వి.భాస్కరరావు ప్రారంభించారు. డాక్టర్ గన్ని భాస్కరరావు, సోము వీర్రాజు, ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి, ఎమ్మెల్యేలు వాసు, ముప్పిడి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ , మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, ఆకుల వీర్రాజు, చల్లా శంకరరావు, సంస్థ ఎండీ, క్లబ్ ప్రెసిడెంట్ ఇమ్మని వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రిన్సిపాల్ రామచంద్రరావు, అధ్యాపకులు

కంబాలచెరువు: ఆదికవి నన్నయ యూనివర్సిటీ, నెహ్రూ యువ కేంద్రం నిర్వహించిన జిల్లా యువజనోత్సవాల్లో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారు. జానపద నృత్య విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రూ.7 వేలు నగదు బహుమతిని అందుకున్నారు. ఈ బృందంలోని దీపిక, స్నేహ, భాను, రాము, అజయ్, అపర్ణను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామచంద్రరావు అభినందించారు.

ఉచిత ఇసుక అమలులో కూటమి విఫలం

- ఎమ్మెల్యే వాసు సమాధానం చెప్పాలి
- వైఎస్సార్ సీపీ నాయకుల ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యిందని, లారీ ఇసుకను రూ.8, 500కు పైగా అమ్మకాలు జరుపుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వాసంశెట్టి గంగాధర్, నక్కా శ్రీనగేష్ మాట్లాడారు. అసలు ఉచిత ఇసుక విధానం అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటిలింగాలరేవు నుంచి గామన్ వంతెన వరకూ 15 ఇసుక ర్యాంపులు ఉన్నాయని, అక్కడ ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నారే తప్ప ప్రజలకు ఉచితంగా ఇవ్వడం లేదన్నారు. బాట చార్జీలు, లోడింగ్ చార్జీలు, లారీకి రూ.2 వేలు ఇలా ఎవరికి ఇష్టమొచ్చినట్టుగా వారు వసూలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల ఆదాయం వచ్చేదని, ఇప్పుడు కూటమి నాయకులు దోచుకోవడమే పరమావధిగా పెట్టుకున్నారన్నారు. 200 మంది సభ్యులతో బోట్స్‌మెన్స్ సొసైటీ ఉన్నా, వారికి ఏ మేరకు ఇస్తున్నారన్నది కూడా ఆగమ్యగోచరంగా ఉందన్నారు. దీనిపై త్వరలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కి ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఇక ఇసుక బుకింగ్ యాప్ అంతా పెద్ద స్కామ్ అన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి దానికి మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌పై విమర్శలు చేయడమే తప్ప, ఈ ఎనిమిది నెలల్లో నగరానికి చేసిందేమీ లేదన్నారు. ఈవీఎంల మహిమ, బూటకపు హామీలతో ప్రజా నిర్ణయానికి భిన్నంగా కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. సమావేశంలో నాయకులు బిల్డర్ చిన్నా, గేడి అన్నపూర్ణరాజు, కాటం రజనీకాంత్, సోడదాసి సుందర్ సింగ్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి

రాజమహేంద్రవరం రూరల్: లారీ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం పిడింగొయ్యి గ్రామానికి చెందిన ఎల్.నరేష్ (20), తన తల్లి సత్యవతిని తీసుకుని సోమవారం ఉదయం 11.30 సమయంలో మోరంపూడి జంక్షన్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడాకు మోటర్‌బైక్‌పై బయలుదేరాడు. కవలగొయ్యి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపైకి వచ్చేసరికి లారీ అతి వేగంగా వచ్చి వారిని ఢీకొంది. కిందపడిపోయిన నరేష్ మీద నుంచి లారీ చక్రాలు వెళ్లిపోయాయి. తీవ్ర గాయాలైన అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సత్యవతి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అందరూ రుణపడి ఉండాలి



ఎడ్లకు పూజలు చేస్తున్న స్టాలిన్ తదితరులు

కడియం: అందరికి ఆహారం అందిస్తున్న రైతులకు ప్రజలందరూ రుణపడి ఉండాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ అన్నారు. జాతీయ రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులను సత్కరించారు. వ్యవసాయ పనులు మొదలు పెడుతూ ఎడ్లకు పూజలు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల సుధాకర్, మాజీ ఎంపీటీసీ నాగిరెడ్డి వీర శివాజీ, నాయకులు పుట్టా బుజ్జి, సత్తి హరిబాబు, నాగిరెడ్డి మోహన్, రైతులు పాల్గొన్నారు.

ముసాయిదా కాపీల దహనం

ప్రకాశం నగర్: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ వ్యవసాయ మార్కెట్ చట్టం ముసాయిదాను రద్దు చేయాలని రైతు సంఘ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం శ్యామలా సెంటర్‌లోని బాలాజీ దాస్ విగ్రహం వద్ద ముసాయిదా కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం రైతు ఉద్యమంపై నిర్బంధ చర్యలు ఆపాలని, రైతులకు మద్దతు ధర గ్యారంటీ చట్టం, రైతు రుణ మాఫీ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కన్వీనర్ సుబ్బారావు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జోజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందర్ బాబు పాల్గొన్నారు.



విద్యుత్ కాంతులతో హోలీ ట్రినిటీ లూథరన్ చర్చి



జాంపేటలోని సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి



సిమెంట్రీ పేటలోని నెల్సన్ మెమోరియల్ చర్చి



హోలీ రెడీమెర్ ఆర్‌సీఎం కేథలిక్ చర్చి

క్రిస్మస్ సందడి

సీటీఆర్ఐ: ఇళ్లపైన స్టార్ల వెలుగులు, వీధుల్లో శాంతా క్లాజ్‌ల సందడి, మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణలతో నగరంలోని ఎక్కడ చూసినా క్రిస్మస్ సందడి నెలకొంది. సర్వలోక పాప పరిహారం కోసం కారణ జన్ముడిగా పుడమికి అరుదెంచిన ఏసుక్రీస్తును ఆరాధించడానికి క్రైస్తవ లోకం సంసిద్ధమైంది. ఈ సందర్భంగా నగరంలోని పలు చర్చిలు విద్యుద్దీపాలతో మెరిసి పోతున్నాయి.

క్రీస్తు ప్రేమ నిస్వార్థమైంది



ఏసుక్రీస్తు చేసిన ప్రతి కార్యములోనూ ప్రేమ ఉంది. ఆయన పరలోకాన్ని విడచి దాసుని స్వరూపం ధరించి, పశువులశాలలో జన్మించి, శిలువ మరణం పొందారు. ఆ దేవుడు ప్రతి సందర్భంలోనూ తన అమూల్యమైన ప్రేమను రుజువు చేశారు.

– డాక్టర్ జాన్‌వెస్లీ, రాజమహేంద్రవరం

అలరించిన క్రిస్మస్ వేడుకలు



క్రీస్తు జననం నాటికను ప్రదర్శిస్తున్న డ్రీమ్స్ స్కూల్ విద్యార్థులు

ధవళేశ్వరం: డ్రీమ్స్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీస్తు జననం నాటికను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. క్రిస్మస్ తాత విద్యార్థుల మధ్య సందడి చేశారు. డ్రీమ్స్ విద్యాసంస్థల చైర్మన్ అంగర రమేష్ క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాళ్లు జి.విమలారోజి, వి.సంధ్యకుమారి, ఎన్.దీపిక, డ్రీమ్స్ ఫస్ట్ ప్రీ స్కూల్ ప్రిన్సిపాల్ కె.లలితా దేవి పాల్గొన్నారు.